భవన నిర్మాణ కార్మికులకు భరోసా ఏదీ ?

- మేనిఫెస్టో హామీలను విస్మరించిన చంద్రబాబు
- నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



గోకవరం బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

సీటీఆర్ఐ: ఎన్నికల వచ్చాయంటే చంద్రబాబు నోటి వెంట అనేక పథకాలు, హామీలు అవలీలగా వచ్చేస్తాయి. అన్ని వర్గాల వారిని మోసం చేయడానికి అనేక సంక్షేమ పథకాలు టీడీపీ మేనిఫెస్టోలో చేరుతాయి. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో భవన నిర్మాణ కార్మికులకు రోజూ పనులు దొరికేవి. రెండు పూటలా కుటుంబం కడుపు నిండా భోజనం చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత ఇసుక పేరుచెప్పి అధిక ధరలకు అమ్మకాలు సాగించడంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. దీనితో భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ అనేక విభాగాల వారికి పని కరువైంది.

గుర్తింపుకార్డు పొందిన కార్మికులు 56 వేల మంది

రాజమహేంద్రవరం పరిధిలో గుర్తింపుకార్డు పొందిన కార్మికులు 56 వేల మంది ఉన్నారు. కార్డులు లేని వారు లక్ష మంది వరకు భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. తాపీపని, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటర్, పెయింటర్, రాడ్ బైండింగ్, సెంట్రింగ్, టైల్స్, మార్బుల్స్, కంకర, ఇసుక, గోతులు తవ్వే వారు, ప్లాస్టర్ పారిస్ సీలింగ్, మట్టిపని చేసేవారు అనేక విభాగాలు వారు పనిచేస్తున్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

గత ఎన్నికల వేళ చంద్రబాబు అధికారంలోకి వస్తే వంద రోజుల్లో భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని, భవన నిర్మాణ కార్మికులకు బీమా పథకం వర్తింపజేస్తామని అనేక హామీలను గుప్పించారు. తీరా నెగ్గి 18 నెలలు దాటినా ఇప్పటి వరకు భవన నిర్మాణ కార్మికులకు ఒరిగేందేమీ లేదు. గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల కోసం స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్‌లో కార్మిక భవనం కోసం స్థలం సేకరణతో పాటు కోటి రూపాయలు మంజూరు చేయించారు. కార్మికుల భవనానికి శంకుస్థాపనతో పాటు పిల్లర్లు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కార్మిక భవనం నిర్మాణం పూర్తిగా ఆపివేశారు.

తెలంగాణలో అలా.. ఇక్కడ ఇలా..

తెలంగాణలో ఎన్నికల హామీల్లో భాగంగా భవన నిర్మాణ కార్మికులకు బీమా పథకం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అది చూసి చంద్రబాబు ఇక్కడ కూడా నిర్మాణ రంగ కార్మికుల కోసం బీమా పథకం అమలు చేస్తామని వాగ్దానం చేసి అధికారం చేపట్టాక విస్మరించారు. తెలంగాణలో భవన నిర్మాణ కార్మికులకు వివాహమైతే రూ.30 వేలు, కార్మికుల కుమార్తె /భార్య డెలివరీ ఐతే రూ. 30 వేల చొప్పున రెండు కాన్పులకు ఇస్తున్నారు. కార్మికుల సహజ మరణానికి రూ.2 లక్షల పరిహారం, ప్రమాదంలో అవయవాలు కోల్పోతే రూ.5 లక్షల పరిహారం, ప్రమాదం కారణంగా మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తీర్మానం చేసింది. ఎప్పటి లాగే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని నిర్మాణ రంగ కార్మికులకు మరోసారి మొండి చెయ్యి చూపించింది.

కొవ్వొత్తుల ర్యాలీ

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అనేక సంఘాల ట్రేడ్ యూనియన్ సభ్యులు బుధవారం గోకవరం బస్టాండ్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చీకటిలో మగ్గిపోతున్న తమను ఆదుకోవాలని, కూటమి ప్రభుత్వం వెంటనే ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ప్లంబర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరావు రాజశేఖర్ తాపీ మేస్త్రీ సంఘం ప్రెసిడెంట్ నాగేశ్వరావు, విఘ్నేశ్వర బోర్డు సెంట్రింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ సుంకర వెంకటేశ్వరరావు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీమా పథకం వర్తింపజేయాలి



తెలంగాణ మాదిరిగా ఇక్కడ కూడా కార్మికులకు బీమా పథకం వర్తింపజేయాలి. చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు పరిహారం అందించాలి. కార్మిక భవనం పూర్తి చేయాలి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికుల కోసం అండగా ఉంటానన్నారు. ఇప్పటి వరకు ఆయన భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంపై స్పందించలేదు. నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోకుంటే కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలిసి వస్తుంది.

– బొజ్జ రామకృష్ణ, భవన నిర్మాణాల సంఘాల సమాఖ్య నగర అధ్యక్షుడు

హామీలను అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికలలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. పనులు లేక పస్తులుంటూ చీకటిలో ఉంటున్నామని తెలియడానికే కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాం.

– కూరపాటి రాజప్ప, రాజరాజ నరేంద్ర పెయింటర్లు, వర్కర్ల ట్రేడ్ యూనియన్

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలి. బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన సదుపాయాలను అందజేయాలి. 2022 నుంచి నిలిచిపోయిన క్లెయిమ్‌లను వెంటనే చెల్లించాలి.

– దేవగుప్త, విశ్వకర్మ వడ్రంగి పనివాళ్ల సంఘం అధ్యక్షుడు

క్లుప్తంగా

సెయింట్ పీటర్ చర్చిలో ఆర్డీఓ విచారణ



చర్చిలో విచారణకు వచ్చిన ఆర్డీఓ కృష్ణనాయక్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం అర్బన్, దానవాయిపేటలోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చ్‌లో దశాబ్దం కాలంగా పరిపాలన, ఆర్థిక లోపాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో), మైనారిటీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బుధవారం సంయుక్తంగా విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ చర్చ్ సభ్యుల ఒక వర్గం సమర్పించిన ఫిర్యాదులో 2013–2023 మధ్య ఆర్థిక అక్రమాలు, ఆడిట్‌లు సక్రమంగా నిర్వహించకపోవడం, పారదర్శకత లోపించడం, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం వంటి పలు ఆరోపణలున్నాయన్నారు. ఈ విషయాలపై సంబంధిత రికార్డులు, వాంగ్మూలాలు, ఆర్థిక పత్రాలను పరిశీలించి, సమగ్ర నివేదికను కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

మహిళా సమాఖ్య సిబ్బందికి షోకాజ్



మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

రాజానగరం: విధులు నిర్వర్తించడంలో బాధ్యరాహిత్యంగా వ్యవహరించిన స్థానిక మండల మహిళా సమాఖ్య ఏపీఎం జి.సునీత, సీసీ జి.నాగార్జునకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని హెచ్‌ఆర్ డీపీఎం (హ్యూమన్ రీసోర్స్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్) డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి ఆదేశించారు. సమయపాలన లోపించిన మండల మహిళా సమాఖ్య కార్యాలయ నిర్వహణ, అందుబాటులో లేని సిబ్బంది తదితర ఆరోపణలపై వాట్సప్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ బుధవారం ఆకస్మికంగా ఈ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సమయానికి ఏపీఓ సునీత, సీసీ నాగార్జున కార్యాలయంలో అందుబాటులో లేరు. రికార్డులను పరిశీలించి, మిగిలిన సిబ్బంది నుంచి పలు విషయాలపై ఆరా తీసిన జిల్లా అధికారి మూర్తి అందుబాటులో లేని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

చేపల చెరువుల లీజు వేలం వాయిదా

రంగంపేట: జి.దొంతమూరులోని చేపల చెరువుల లీజుకు సంబంధించి బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన బహిరంగ వేలం వాయిదా వేసినట్టు కార్యదర్శి పి. శ్రీవల్లి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ స్థానిక పంచాయితీ పరిధిలో 13 చెరువులు ఉన్నాయన్నారు. వాటిలో చేపల పెంపకానికి లీజుకు ఇవ్వడానికి బహిరంగ వేలం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. పోలీసు శాఖ అనుమతి లేనందున శాంతి భద్రతల సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున బుధవారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేసినట్టు తెలిపారు. వేలం ఎప్పుడు నిర్వహించేది పంచాయతీ ద్వారా త్వరలో తెలియజేస్తామన్నారు.

విద్యార్థులకు స్టీలు కంచాల పంపిణీ

బిక్కవోలు: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఊలపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీవీ కన్నారావు అన్నారు. ఊలపల్లికి చెందిన బోడా రాజుబాబు, ఆయన సోదరులు బోడా లోవరాజు కలిసి సరోజిని ఫౌండేషన్ తరుపున మెగా పీటీఎం సందర్భంగా బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం చేసే 90 మంది విద్యార్థులకు స్టీలు కంచాలు పంపిణీ చేశారు. గతంలో వీరు 150 మందికి స్టీలు కంచాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	ఘాటీ
సూర్యమినీ :	ది కంజూరింగ్
సూర్యప్యాలెస్ :	ఘాటీ
స్వామి :	కూలీ
అనుశ్రీ :	మదరాసి
శివజ్యోతి :	ది బెంగాల్ ఫైల్స్
రాజా :	మదరాసి
ఊర్వశి :	లిటిల్‌హార్ట్స్
మేనక :	ది కంజూరింగ్
రంభ :	మహావతార్ నరసింహ
అప్సర :	కొత్తలోక
అశోక :	మదరాసి
నామవరం	
వీఎస్ మహల్ :	ఘాటీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఘాటీ, మదరాసి
కడియం	
వెంకటసూర్య :	మదరాసి, ఘాటీ

వర్మీకంపోస్ట్ తయారీలో మెళకువలు పాటించాలి



వర్మీ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: చెత్త సేకరణతో తయారు చేసే వర్మీ కంపోస్ట్ విధానంపై మెళకువలు పాటించాలని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. బుధవారం నారాయణపురం, గాదాలమ్మ నగర్‌లోని వర్మీ కంపోస్ట్ యూనిట్లను ఆయన తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు నిర్మించిన యూనిట్లు నిరుపయోగం కాకుండా సంపద సృష్టించాలన్నారు. నగరంలో ప్రస్తుతం 5 చోట్ల ఐటీసీ, గాదాలమ్మనగర్, ఎంఎస్‌ఆర్ నగర్, గెయిల్ ఆఫీస్, నారాయణపురం పార్కులో వర్మీ కంపోస్ట్ యూనిట్లు వినియోగంలో ఉన్నట్లు వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య కార్మికులు సేకరించిన తడి చెత్తను వర్మీ కంపోస్ట్ యార్డులకి తరలించి, సేంద్రియ ఎరువుగా రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయం పట్ల రైతులు పెద్దఎత్తున మొగ్గు చూపుతున్నారన్నారు. వివిధ రకాల వానపాములను ఉపయోగించడం ద్వారా సేంద్రియ వ్యర్థాలను నిర్వహించవచ్చన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

శాంతి భద్రతల పటిష్టతకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘు సభ్యులు

సీటీఆర్ఐ: రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు కల్పించేందుకు అదనపు పోలీస్ సిబ్బంది అవసరమని ప్రభుత్వం త్వరితగతిన పోలీసు సిబ్బంది నియామకాలు చేపట్టాలని బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సానబోయిన రామారావు కోరారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కోటిపల్లి బస్టాండు సమీపంలో రాత్రి గస్తీలో ఉన్న పోలీస్ సిబ్బందిపై రౌడీ మూకలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీస్ సిబ్బంది స్టేషన్‌కి సమాచారం అందించినా సత్వరమే అక్కడికి వారు చేరుకోలేకపోవడానికి ప్రధాన కారణం సిబ్బంది, రక్షణ వాహనాల కొరతేనని అన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో బెల్ట్ షాపులు లేకుండా చర్యలు చేపట్టాలని, మద్యం దుకాణాల నిర్వహణ సమయం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్, బత్తిన ఏడుకొండలు, లాజర్ పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి వెంకటరమణ

రాజమహేంద్రవరం సిటీ: సహకార సంఘాలు సభ్యుల సహకారంతో నడిచే స్వయంప్రతిపత్తి సంస్థలని, సంఘాల అభివృద్ధిలో పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్, సభ్యులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారులు కీలకపాత్ర వహిస్తున్నారని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం నగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025 సందర్భంగా జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్లు, పాలకవర్గ విధులు, బాధ్యతలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సహకార సంఘాల అభివృద్ధికి పాలకవర్గం నిబద్ధతతో కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డివిజనల్ కోఆపరేటివ్ అధికారి మొద్దేద్దుల కనకదుర్గారెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారి శ్రీనివాస్, సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్లు, సభ్యులు, సీఈఓలు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

బియ్యం అక్రమార్కులపై చర్యలేవీ?



అనపర్తి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : చట్టబద్ధమైన ఆహార భద్రత హక్కును కాలరాస్తూ పేదలకు పట్టెడు అన్నం పెట్టడానికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లోకి తరలిస్తూ అధికార కూటమి నాయకులు చట్టానికి తూట్లు పొడుస్తూ నిరుపేదల నోటి వద్ద కూడును లాక్కుంటున్న అక్రమార్కులపై చర్యలేవని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వృద్ధులు, కుటుంబ పోషణకు పనులు చేసుకునే వారికి ఇబ్బంది లేకుండా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే వారని, నేరుగా వాహనం ద్వారా బియ్యం, ఇతర రేషన్ సరుకులు ఇంటి ముంగిటకే రావడంతో దాదాపు అందరూ వాటిని తీసుకునే వారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎండీయూలను రద్దు చేయడంతో చాలా మంది రేషన్ షాపుల వద్ద క్యూలైన్లలో నిలబడలేక బియ్యాన్ని తీసుకునేందుకు ఆసక్తి చూప డం లేదని, దీనిని ఆసరాగా చేసుకుని అధికార పార్టీ నాయకులు బినామీల ద్వారా బియ్యాన్ని కిలో రూ.18 వరకూ చెల్లించి తీసుకుని మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి తెలియకపోతే తక్షణమే స్పందించి ఈ వ్యవహారంలో జరుగుతున్న విషయాలపై దృష్టి సారించి, అక్రమాలను బహిర్గతం చేయాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి గ్రామ కన్వీనర్ నల్లమిల్లి బాల మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, పొలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి వైఎస్ జగన్ విశేష కృషి



రెవ.విజయసారథికి వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు ఏలియా, ఎలీషా

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల సంక్షేమానికి విశేష కృషి చేశారని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెవ.విజయసారథి అన్నారు. బుధవారం కొంతమూరులోని ఆయన కార్యాలయంలో ధవళేశ్వరం పాస్టర్ ఫెలోషిప్ నుంచి రెవ.కె.ఏలియా, శాటిలైట్ సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ నుంచి రెవ.బి.ఎలీషా తదితరులు విజయసారధిని కలసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పాస్టర్లకు గౌరవవేతనం రూ.5వేలు కూటమి ప్రభుత్వం పారదర్శకంగా అందించడం లేదని అన్నారు. క్రైస్తవుల వివాహ నమోదు ప్రక్రియను సరళతరం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందించడం లేదని ఆయన అన్నారు. వివాహాలకు సంబంధించి పాస్టర్లు ఇస్తున్న ధ్రువీకరణ పత్రాలు నమోదు ప్రక్రియకు పనికి రావంటూ చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విన్నవించారు. క్రైస్తవ విశ్వాసానికి గుర్తింపుగా బాప్తిజము ఇవ్వడానికి ప్రభుత్వం ద్వారా గోదావరి నదిలో ఒకరేవు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు విజయ సారధి మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద అంబులెన్స్ దందాను అరికట్టాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద అంబులెన్స్ నిర్వాహకులు రంపచోడవరం తీసుకెళ్లేందుకు గిరిజనుల నుంచి రూ.18 వేలు వసూలు చేశారని గోదావరి అంబులెన్స్ ఓనర్లు, డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు బొంత శ్రీహరి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి బయట ఉన్న 20 మంది అంబులెన్స్ నిర్వాహకులు, డ్రైవర్లు శవాలను పీక్కు తినే రాబందులుగా తయారై, రోగులు, మృతుల బంధువుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తూ దారుణంగా దోపిడీ చేస్తున్నారన్నారు. గోదావరి అంబులెన్స్ సంఘంలో 170 అంబులెన్స్‌లు ఉన్నాయని, అవి రంపచోడవరానికి తీసుకెళ్లడానికి రూ.4,500 మాత్రమే వసూలు చేస్తున్నాయన్నారు. కొందరు దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వాసుపత్రి వద్దకు ఇతర అంబులెన్స్‌లను రానివ్వడం లేదన్నారు. ఈ దందాపై కలెక్టర్, ఎస్పీ వెంటనే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో అనాథ శవాలకు, నిరుపేద కుటుంబాలకు గోదావరి అంబులెన్స్ సంఘ ఉచిత సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు కరుణామయుడు బోస్, ఉపాధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి శేఖర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వి.ప్రసాద్, సభ్యులు కె.సూరిబాబు, భానుప్రసాద్, స్వరూప్, కె.సాయి, కె.శ్రీనివాస్, మురళీ, గణపతి పాల్గొన్నారు.

ఆలోచనలకు పదును పెట్టండి



జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ, ఆలోచనలకు పదును పెడితే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంట్రడక్షన్ టు మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్ ఫర్ ప్రెడిక్షన్ ఆఫ్ ప్రాపర్టీస్ ఆఫ్ మెటీరియల్స్ అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రధాన భాగమైన యంత్ర అభ్యాసం ఇకపై కంప్యూటర్ శాస్త్రవేత్తలకు మాత్రమే ఒక ప్రత్యేక రంగం కాదని, ఇది సార్వత్రిక సాధనం అని పేర్కొన్నారు. మెషిన్ లెర్నింగ్‌తో మెకానికల్ ఇంజినీర్ల భవిష్యత్తే మారబోతుందన్నారు. మెషిన్ లెర్నింగ్‌పై మంచి పట్టును సాధించి, అద్భుత ఫలితాను అందుకునే దిశగా ఇటువంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, కోర్సు కోఆర్డినేటర్ కె. శ్రీహర్షరెడ్డి, అధ్యాపకులు బి.లక్ష్మి, కె. దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో దేశాభివృద్ధి వేగవంతం



ప్రధాని మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న సోము వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జీఎస్టీ తగ్గుదలతో దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. జీఎస్టీనీ నాలుగు స్లాబ్‌ల నుంచి రెండు స్లాబులకు తగ్గించి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ అభినందనీయులని వారన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో జీఎస్టీ తగ్గుదలపై కృతజ్ఞతలు తెలుపుతూ క్వారీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం జంక్షన్లో బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆర్‌ఎస్‌ఎస్‌పై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. ఉండవల్లితో బహిరంగ చర్చకు తాను సిద్ధమని అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో దేశభక్తుడైన రాధాకృష్ణన్‌కు ఓటు వేయవద్దని ఉండవల్లి చెప్పడం సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మీప్రసన్న, స్టేట్ మీడియా ప్రతినిధి పెద్దిరెడ్డి రవి కిరణ్, బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాల పరిశీలన



ప్రభుత్వాసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు: ప్రభుత్వాసుపత్రిని, వైద్య కళాశాలను కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం రాత్రి పరిశీలించారు. ముందుగా ఆసుపత్రికి చేరుకుని వార్డులన్నీ పర్యటించారు. అక్కడ రోగులతో మాట్లాడారు. అనంతరం వైద్య కళాశాలను పరిశీలించారు. వైద్య విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మీ, వైద్యాధికారులు, వైద్యులు ఉన్నారు.

రక్షిత తాగునీరు సరఫరా చేయాలి



దోమాడ వాటర్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

పెదపూడి: గ్రామాల్లోని ప్రజలకు శుద్ధిచేసిన రక్షిత నీటిని సరఫరా చేయాలని కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి అన్నారు. దోమాడ గ్రామ పంచాయతీలో తాగునీరు రక్షిత పథకాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించి ట్యాంకు శుభ్రత, తాగునీటి పథకం నిర్వహణ తదిత వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ట్యాంక్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని, పరిసరాలను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీలో పలు రికార్డులు తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, సచివాలయం కార్యదర్శి లక్ష్మమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్, సర్పంచ్ మీనవల్లి శారదదేవి పాల్గొన్నారు.

సుధాకర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రకాశం నగర్ : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వ్యక్తులు కొనియాడారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం సుధాకర్ రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కంటిపూడి సర్వరాయుడు, వామపక్ష నాయకులు, తాటిపాక మధు, టి.అరుణ్ మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి సేవలను కొనియాడారు.

జీజీహెచ్‌లో ఇనుము దొంగలు పట్టివేత

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాలలో ఇనుము దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కొద్దిరోజులుగా ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాలలో ఉన్న ఇనుము, ఇతర వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ఇద్దరు వ్యక్తులు వాటిని దొంగిలిస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఇద్దరు దొంగలను మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు.

'రణభేరి' విజయవంతం చేయాలి

బిక్కవోలు: తమ విద్యా, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్రమంతటా నిర్వహించే రణభేరి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. పందలపాకలో బుధవారం రణభేరి కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను యూటీఎఫ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. బిక్కవోలు మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.గోవిందరావు, ఎస్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.